భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక

**(2023 జనవరి 28 – 29 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

## కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక

**(2023 జనవరి 28- 29 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)**

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థికాభివృద్ధి బాగా మందగించింది. మాంద్యం తప్పక వస్తుందని అంతటా భావిస్తున్నారు. 80 ఏళ్ల తరువాత ఒకే దశాబ్దంలో రెండు ప్రపంచ మాంద్యాలు సంభవించడం ఇదే ప్రథమం అవుతుంది. మూడు దశాబ్దాల కాలంలో ప్రపంచ ఆర్థికాభివృద్ధి మూడోసారి అత్యంత అథమస్థాయికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. 2009, 2020 ప్రపంచ మాంద్యాల తరువాత ఇది మూడోది. ప్రపంచ ఆర్థికాభివృద్ధి తీవ్రమైన, సుదీర్ఘమైన మాంద్యంలోకి వెళుతుందని అంచనాలు చెబుతున్నాయి. ఆరు మాసాల క్రితం ప్రపంచార్థికాభివృద్ధి 3.0 శాతం ఉంటుందన్న అంచనాలు తారుమారై ఇప్పుడు 1.7 శాతం ఉంటుందని చెబుతున్నారు. పతనం అనేది విస్తృత స్థాయిలో ఉంటుంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఉంటుంది. కరోనా మహమ్మారికి ముందున్న దశాబ్దం కన్నా తలసరి ఆదాయం పెరుగుదల తగ్గిపోతుంది. 2023లో అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధి 0.5 శాతానికి పడిపోతుందని అంచనా. అమెరికా వృద్ధి 0.5 నుండి 2023లో 0.2కు పడిపోతుందని అంచనా. ఇది గత అంచనాల కన్నా 1.9 శాతం తక్కువ. ఇది 1970 తరువాత అధికార మాంద్యం లెక్కల బయట సంభవించిన అతి హీనమైన వృద్ధి. ఐరోపా యూనియన్ వృద్ధి 2023లో 0 శాతం ఉంటుందని అంచనా. ఇక్కడ కూడా అంచనా 1.9 శాతం తగ్గింది.

చైనా ఆర్థిక వ్యవస్థ 4.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. గత అంచనాల కన్నా ఇది 0.9 శాతం తక్కువ. మిగిలిన వర్ధమాన దేశాలన్నిటి వృద్ధి 2022లో 3.8 శాతం ఉండగా 2023లో 2.7 శాతం ఉంటుందని అంచనా. 2024 చివరి నాటికి అన్ని అభివృద్ధి చెందుతున్న, వర్ధమాన (ఇఎండిఇ) దేశాల జిడిపి కరోనాకు ముందు వేసిన అంచనాల కన్నా 6 శాతం తక్కువ ఉంటుందని అంచనా.

తక్షణం సంభవించే ఆర్థిక మాంద్యం వల్ల ప్రపంచ జనాభా జీవన పరిస్థితులు దారుణంగా దెబ్బతింటాయి. వర్ధమాన దేశాల్లో తలసరి ఆదాయం పెరుగుదల సగటున 2.8 శాతానికి, అంటే 2010–2019 సగటు కంటే ఒక శాతం తక్కువకు పడిపోవడం వల్ల పేదరికం మరింత పెరుగుతుంది. ప్రపంచంలోని కటిక పేదల్లో 60 మంది సహారా దిగువ ఆఫ్రికా దేశాల్లో ఉన్నారు. 2023–24లో ఈ ప్రాంతంలో తలసరి ఆదాయం పెరుగుదల సగటున 1.2 శాతం ఉంటుందిన అంచనా. అంటే ఇక్కడ మరింత మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడతారు.

**నిరుద్యోగం :** అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తన 'ప్రపంచ ఉపాధి, సామాజిక అంచనాల నివేదిక (2023, జనవరి 14) లో 2022లో లేబర్ మార్కెట్ పుంజుకునే అంచనాలను తగ్గించి వేసింది. 5.2 కోట్ల పూర్తి కాలం ఉద్యోగాలకు సమానమైన పని గంటలు తగ్గిపోతాయని పేర్కొంది. 2021 మేలో అది 2.6 కోట్ల పూర్తి కాలం ఉద్యోగాలకు పడ పనిగంటలు తగ్గిపోతాయని అంచనా వేసింది. 2019లో ప్రపంచంలో ఉద్యోగాల కల్పన 18.6 కోట్లు ఉండగా 2022లో అది 20.7 కోట్లు ఉంటుందని అంచనా. చాలా మంది ఉపాధి మార్కెట్‌ను వదిలేశారు గనుక ప్రపంచ నిరుద్యోగంపై ప్రభావం ఈ అంకెల్లో చెప్పినదాని కన్నా తీవ్రంగా ఉంటుందని ఐఎల్ఓ హెచ్చరించింది. ప్రపంచ వ్యాపితంగా కార్మికశక్తి వినియోగ రేటు 2019లో ఉన్న దానికన్నా 2022లో 1.2 శాతం తక్కువగా ఉంటుందని అంచనా.

సర్వీసు రంగం, ముఖ్యంగా ఐటి రంగంలో పెద్ద ఎత్తున లే ఆఫ్‌లు, వేతనాల కోతలు జరుగుతున్నాయి. దీని ప్రభావం ప్రపంచ వ్యాపితంగా ఉంటుంది.

1961లో ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (ఫావో) రికార్డు చేయడం ప్రారంభించిన తరువాత ప్రపంచ ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ధాన్యాలు, వంటనూనెలతో సహా ఆహార ద్రవ్యోల్బణం 2022లో అత్యధికంగా ఉంది. 2022లో ఆహార ధరల సూచీ సగటున 143.7 శాతం ఉంది. 2021 సగటు కన్నా ఇది 14 శాతం ఎక్కువ.

**ప్రపంచ అసమానతలు:** 'అధిధనికుల మనుగడ' అన్న పేరుతో వెలువడిన సరికొత్త ఆక్స్‌ఫామ్ నివేదిక (జనవరి 2023) ప్రకారం కరోనా వచ్చిన గత రెండేళ్ల కాలంలో ప్రపంచంలోని 1 శాతం అత్యంత ధనికులు మిగిలిన 99 శాతం మంది సంపద కలిపితే దానికి రెండురెట్లు అధికంగా సంపద పోగు చేసుకున్నారు. 2020 తరువాత 42 లక్షల కోట్ల డాలర్ల కొత్త సంపద సృష్టించబడితే దానిలో మూడొంతులు పై స్థాయిలోని 1 శాతం ధనికులు చేజిక్కించుకున్నారు. ఒకవైపు 170 కోట్ల మంది కార్మికులు తమ వేతనాల కన్నా ద్రవ్యోల్బణం ఎక్కువగా పెరిగిన దేశాల్లో ఉండగా మరోవైపు ప్రపంచ శతకోటీశ్వరుల సంపద రోజుకు 270 కోట్ల డాలర్ల చొప్పున పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం ఫలితంగా నిజవేతనాల్లో కోతలు పడ్డంతో ప్రపంచంలో 33,700 కోట్ల డాలర్ల మేర వేతనాలు తరిగిపోయాయి. ప్రపంచ చరిత్రలో నిజవేతనాలు ఇంత పెద్ద తగ్గిపోవడం ఇదే ప్రథమం.

**దావోస్:** ప్రపంచంలోని సూపర్ ధనికులంతా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్‌లో సమావేశమై కరోనా తరువాత కాలంలో మహమ్మారి ఉన్నప్పటికీ, ప్రపంచ ఆర్థిక మాంద్యం తచ్చాడుతున్నప్పటికీ తామంతా కలిసి 2.6 లక్షల కోట్ల డాలర్ల సంపద పోగు చేసుకోగలిగినందుకు సంబరాలు చేసుకున్నారు.

మనం పార్టీ 23వ మహాసభలో చెప్పినట్లు 17 లక్షల కోట్ల డాలర్ల ఈ ఉద్దీపన పథకాలన్నీ కూడా స్టాక్ మార్కెట్‌లను పైకెత్తి ఆస్తుల విలువలు నాటకీయంగా పెంచేయడానికి ఉద్దేశించినవే అన్న విషయాన్ని దావోస్ సభ నిర్ధారించింది. దీని వల్ల 2020 తరువాత సృష్టించబడిన కొత్త సంపదలో మూడింట రెండొంతులు (63 శాతం) 1 శాతం అతి ధనికులు చేజిక్కించుకోవడం జరిగింది. కింద నున్న 90 శాతం ప్రజలకు కేవలం పదోవంతు మాత్రమే దక్కింది.

"2023వ సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రపంచం పూర్తిగా కొత్తవీ, అదే సమయంలో తెలిసినవీ అయిన అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది" అని ప్రపంచ ప్రమాదాల నివేదిక 2023 పేర్కొంది. అందరికీ తెలిసిన ప్రమాదాలు: ద్రవ్యోల్బణం పెరగడం, జీవన వ్యయ సంక్షోభం, వాణిజ్య యుద్ధాలు, అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుండి పెట్టుబడులు వెనక్కు పోవడం, విస్తృతమైన సామాజిక అశాంతి, భూగోళ–రాజకీయ ఘర్షణలు, ఇంకా అణు యుద్ధ ప్రమాదం. వీటితో బాటు కొత్త ప్రమాదాలు: భరించసాధ్యం కాని రుణాలు, తక్కువ స్థాయి అభివృద్ధి, తక్కువ స్థాయి

ప్రపంచ పెట్టుబడులు, నిష్ప్రపంచీకరణ, మానవాభివృద్ధి సూచీలు దిగజారిపోవడం, వాతావరణ మార్పులు 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ప్రపంచంపైపు పయనించే మార్గాలను మూసివేస్తుండడం. ఒక్క మాటలో చెప్పాలంటే దశాబ్దం అస్థిరంగా, సంక్షుభితంగా ఉంటుందని అది హెచ్చరించింది.

అయితే ఈ నివేదిక సహజంగానే అసలు సమస్యను వదిలేసింది : ప్రపంచ ప్రజల చేతుల్లో కొనుగోలు శక్తి వేగంగా క్షీణిస్తుండడం సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెడుతోంది. పెరుగుతున్న ఆదాయ, సంపద అసమానతలను వెనక్కు మళ్లించడం ద్వారానే ఈ క్రమాన్ని వెనక్కు తీసుకురాగలం. 2021-22లో 136 దేశాలు అంగీకరించి ఇప్పటి వరకు అమలు నోచుకోని ప్రపంచ కనీస పన్ను వసూలును అమలు చేయడమే దీనికి కీలకం.

**మూల్గలు పిప్పిచేసే నయా-ఉదారవాదం:** 23వ పార్టీ మహాసభలో పేర్కొన్నట్లు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలోని నయా-ఉదారవాదం ఆదాయ, సంపద అసమానతలను మరింత పెంచుతోంది. గరిష్ట లాభార్జన ఫలితమిది. ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారితీస్తున్న ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి ఏ మాత్రం పరిష్కారం చూపలేని దివాళా స్థితిలో నయా-ఉదారవాదం ఉందని నిరూపితమైంది. అదే సమయంలో గరిష్ట లాభాలు పోగుచేసుకోవడం అనే తన ఏకైక లక్ష్యంపై అది దృష్టి పెట్టడం వల్ల ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతోంది. అసమానతలు ఇంత దారుణంగా పెరిగిపోతున్నప్పటికీ నయా-ఉదారవాదం శతకోటీశ్వరులపై సూపర్-ధనిక, సంపద పన్ను విధించడానికి అడ్డుపడుతోంది. పన్నుల ద్వారా వచ్చే ప్రతి డాలరులోల 4 శాతం మాత్రమే సంపదపై వేసే పన్నుద్వారా వస్తోంది. ధనికులైన శతకోటీశ్వరుల మీద 5 శాతం సంపద పన్ను వేస్తే ఏడాదికి 1.7 లక్షల కోట్ల డాలర్లు వస్తాయి. ప్రజలందరికీ ఆరోగ్యం, విద్య అందించడం ద్వారా ప్రపంచంలో పేదరికాన్ని నిర్మూలించడానికి ఇది సరిపోతుంది.

## ప్రజా నిరసనలు

పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిజవేతనాలు పడిపోవడంతో జీవన ప్రమాణాలు సంక్షోభంలో పడ్డ శ్రామిక ప్రజలు ప్రపంచ వ్యాపితంగా రోడ్లమీదకు వచ్చి నిరసన పోరాటాల్లో పాల్గొంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో అనేక కొరతలను ఎదుర్కొంటున్న యూరప్‌లో ఈ నిరసనలు మరింత ఉద్ధృతంగా జరుగుతున్నాయి.

ఫ్రాన్స్‌లో జనవరి19 పెద్ద సమ్మె జరిగింది. పింఛను వ్యవస్థలో మార్పులకూ, రిటైర్‌మెంట్ వయసు పెంపుకూ ప్రభుత్వ ప్రయత్నాలకు నిరసనగా కార్మికుల పెద్ద ఎత్తున నిరసనల్లో పాల్గన్నారు. సమ్మెలు రానున్న కాలంలో కూడా కొనసాగే అవకాశం ఉంది. బ్రిటన్‌లో కూడా సమ్మెలు జరుగుతున్నాయి. 2022 డిసెంబర్‌లో ఇంగ్లండ్‌లో నర్సులు గత 106 సంవత్సరాల్లో మొట్టమొదటి సారిగా సమ్మె చేశారు. ఇటీవలి వారాల్లో రైల్ కార్మికులు సమ్మెచేశారు. టీచర్లు, ఆరోగ్యరంగ కార్మికులు ఫిబ్రవరిలో సమ్మెకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రీసు, స్పెయిన్, జర్మనీతో సహా ఐరోపా యూనియన్‌లోని అనేక సభ్య దేశాల్లో కార్మికులు ఇటీవల సమ్మెల్లోకి దిగారు. వీరంతా ప్రధానంగా వేనాలు పెంచాలనీ, జీవన ప్రమాణాలు కాపాడాలనీ కోరుతూ సమ్మెలు చేశారు.

## ఉక్రెయిన్ యుద్ధం

ఉక్రెయిన్ యుద్ధం సృష్టించిన మరింత అస్థిరత, ప్రపంచవ్యాపితంగా ఆహారం, ఇంధన సరఫరాలకు అందరాయం కొనసాగుతూనే ఉంది.

ఈ యుద్ధం ఉక్రెయిన్ క్షేత్రంగా అమెరికా/నాటోకూ రాష్యాకూ మధ్య జరుగుతోందని పార్టీ 23వ మహాసభ చెప్పిన అవగాహనను జరుగుతున్న పరిణామాలు ధృవీకరిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు సైనిక సహాయం క్రింద బైడెన్ ప్రభుత్వం 2,740 కోట్ల డాలర్లకు పైగా ఖర్చు చేసింది. ఇప్పుడు 13వ దఫాగా మరో 250 కోట్ల డాలర్ల సహాయాన్ని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు.

మొత్తం సహాయం (సైనిక, ఆర్థిక, మానవతా సహాయాలు కలుపుకుంటే) ఐరోపా యూనియన్ ఉక్రెయిన్‌కు అత్యధికంగా అందజేసింది. అమెరికా సైనిక సహాయం అత్యధికంగా అందించింది. ఇది అమెరికా సైనిక–పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసింది. ఆయుధాల ఉత్పత్తి పెంచడం వల్ల ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతుందనీ, దాని వల్ల దేశీయ గిరాకీ పెరిగి పెరుగుతున్న మాంద్యానికి కళ్లేలు వేయవచ్చుననీ అమెరికా ఆశిస్తోంది.

ఉక్రెయిన్‌కు 2022 జనవరి 24 నుండి నవంబర్ 20 వరకు 46 దేశాల నుండి ఆర్థిక, మానవతా, సైనిక సహాయం క్రింద 10,880 కోట్ల డలర్లు అందాయని కీల్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. ఈ 10,880 కోట్ల డాలర్లలో 5,180 కోట్ల డాలర్లు

ఐరోపా యూనియన్ నుండి, 4,780 కోట్ల డాలర్లు అమెరికా నుండి అందాయి. మిగతా మొత్తంలో అత్యధిక భాగం బ్రిటన్, కెనడా, నార్వేల నుండి మిగిలిన దేశాల నుండి గణనీయమే అయినా పైవాటితో పోలిస్తే కొద్ది మొత్తాలు అందాయి. సైనిక సహాయానికి సంబంధించి అమెరికా ఇతర అన్ని దేశాలు ఇచ్చిన దాన్ని కలిపితే వచ్చే మొత్తం కన్నా ఎక్కువ సహాయం అందించింది. ఉక్రెయిన్‌కు సహాయం అందించడం కోసం జర్మనీ, స్వీడన్ వంటి కొన్ని నాటో దేశాలు ఇతర దేశాలకు దాడిచేసే సైనిక సహాయం అందించకూడదు అన్న తమ పాత నిర్ణయాలను తిరగదోడాయి. ఐరోపా యూనియన్ తన చరిత్రలో మొదటి సారిగా కొత్త ఆర్థిక సంస్థ అయిన ఐరోపా శాంతి వేదిక (ఇపిఎఫ్) ద్వారా మారణాయుధాలను సరఫరా చేసింది.

## ఇజ్రాయిల్: కొత్త పచ్చి-మితవాద ప్రభుత్వం

ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంలోని ప్రభుత్వం 2022 డిసెంబర్ 29న తిరిగి అధికారంలోకి వచ్చింది మొదలు తన పచ్చి-మితవాద విధానాలను అనుసరించడం సాగిస్తోంది. ఈ విధానాల ప్రభావం ఇజ్రాయిల్‌లోని అంతర్గత రాజకీయాలు, విధానాల మీద అదే సమయంలో ఇజ్రాయిల్‌లోనూ, ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లోనూ నివసిస్తున్న పాలస్తీనియన్ల మీదా పడుతుంది. ఇజ్రాయిల్ చరిత్రలోనే ఇది అత్యంత మితవాద జాతీయవాద-మతతత్వ ప్రభుత్వం. 2022 నవంబర్ 1న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో నెతన్యాహూకు చెందిన లికుడ్ పార్టీ, దాని పచ్చి-మితవాద మిత్ర పక్షాలు అత్యధిక స్థానాలు గెలుచుకోవడం వల్ల ఈ ప్రభుత్వం ఏర్పడింది. సుప్రీమ్ కోర్టును బలహీనపరిచి న్యాయ వ్యవస్థమీద ప్రభుత్వాధిపత్యం సంపాదించే ప్రణాళిక ఈ ప్రభుత్వ ఎజెండాలో ఒక అంశం. ముసాయిదా బిల్లు రూపంలో విడుదలైన ఈ ప్రణాళిక సుప్రీకం కోర్టుకు ఉన్న చట్టాలను రద్దు చేసే అధికారాన్ని బలహీన పరుస్తుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వ పాత్రను మరింత పెంచేస్తుంది. 120 సీట్ల పార్లమెంటు లేక నెస్సెట్ కేవలం 61 ఓట్ల కొద్దిపాటి మెజారిటీతో సుప్రీం కోర్టు నిర్ణయాలను పక్కనబెట్టేస్తుంది. అక్రమిత పశ్చిమ తీరంలో ప్రయివేటు పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ ఔట్‌పోస్టులు నిర్మించడం చట్ట విరుద్ధమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును

రద్దు చేయగలం అని కూడా నెతన్యాహూకు చెందిన పచ్చి-సంప్రదాయవాద, జాతీయోన్మాద మిత్రపక్షాలు ఆశిస్తున్నాయి.

ఆక్రమిత పశ్చిమ తీరాన్ని కైవశం చేసుకోవడం ప్రభుత్వ ముఖ్య ఎజెండాల్లో మరొకటి. ప్రభుత్వ ఏర్పాటు ముందు తన సంఘటనలోని ప్రధాన భాగస్వామి అయిన మతతత్వ జియోనిస్ట్ పార్టీతో నెతన్యాహూ కుదుర్చుకున్న అనేక ఒప్పందాల్లో పశ్చిమ తీరాన్ని కైవశం చేసుకోవడం ఒక ఒప్పందం. అంటే పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశం తమకు లేదని ఆయన ప్రభుత్వం స్పష్టంగా వెల్లడిస్తున్నదన్న మాట. ఆక్రమిత తూర్పు జెరూసలెంలోనూ, ఇజ్రాయిల్ లోపలా పాలస్తీనా జెండాలన్నిటినీ తొలగించాలని ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. పాలస్తీనా జాతీయ చిహ్నాన్ని ప్రదర్శించడం ఉగ్రవాద చర్య అన్ని పేర్కొంది.

పాలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ దాడులు మరింత ఉధ్ధృతమయ్యాయి. నిరస తెలిపేవారినీ, అమాయక ప్రజలనూ కాల్చిపారేస్తున్నారు. ఈ ఏడాది మొదటి 20 రోజుల్లోనే 19 మంది పాలస్తీనియన్లను కాల్చి చంపారు. గత ఏడాది మొత్తం మీద 176 మందిని వధించారు. సరికొత్తగా ఇజ్రాయిల్ సైన్యం పశ్చిమ తీరంలోని జెనిన్ పైకి సైన్యాన్ని పంపించి వృద్ధులైన మహిళలతో సహా మొత్తం 10 మందిని చంపేశారు.

పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం హత్యాకాండకు ప్రతిచర్యగా జనవరి 27న తూర్పు జెరూసలెంలో ఒక ప్రార్ధనా మందిరం వద్ద జరిగిన కాల్పుల్లో ఏడుగురు మరణించారు, ముగ్గురు గాయపడ్డారు. పచ్చి-మితవాద ప్రభుత్వం ఏర్పడ్డంతో పాలస్తీనియన్లపై దాదాపు యుద్ధం ప్రకటించడం జరిగింది.

**నిరసనలు:** ఇజ్రాయిల్ న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాలరాసే ప్రతిపాదనలకు నిరసనగా వేలాది మంది ఇజ్రేలీలు టెల్ అవీవ్‌లోనూ ఇతర నగరాల్లోనూ వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. దేశ వ్యాపితంగా విశ్వ విద్యాలయాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు కూడా ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. న్యాయవ్యవస్థను పూర్తిగా మార్చేయడానికి ప్రభుత్వం వేసిన పథకానికి నిరసనగా వందలాది మంది ఇజ్రేలీ న్యాయవాదులు వివిధ కోర్టుల ముందు ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయవాదులు ఈ విధగా రోడ్లమీదికి రావడం అరుదు. నూతన ప్రభుత్వ విధానాలను తిరస్కరించాలని హదష్ పార్టీ, ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీలతో సహా అనేక మధ్యే వాద, వామపక్ష పార్టీలు యూదులకూ, అరబ్బులకూ పిలుపునిచ్చాయి.

## బ్రెజిల్

లూలా బ్రెజిల్ అధ్యక్షునిగా ప్రమాణం చేసిన వారం రోజుల్లోనే ఎన్నికల్లో ఓటమి పాలైన జైరో బోల్సనారో మద్దతుదారులు బ్రెజిల్ ప్రభుత్వ త్రివిధ అంగాలపై దాడి చేశారు. రాజధాని నగరమైన బ్రసిలియాలోని శాసన, న్యాయ, పరిపాలనా భవనాలను వారు ఆక్రమించుకోడానికి ప్రయత్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన లూలా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాన్ని మొగ్గలోనే తుంచేసింది. ప్రభుత్వ సంస్థలపై మితవాద-పక్ష దాడులను ఖండిస్తూ, వర్కర్స్ పార్టీకి చెందిన కొత్త అధ్యక్షుడు లూలా ప్రభుత్వానికి సంఘీభావంగా అనేక నగరాల్లో వేలాది మంది ప్రజలు ప్రదర్శనలు జరిపారు.

లూలా మరోసారి బ్రిక్స్, సెలాక్ వంటి బహుళ పక్ష కూటముల ఏర్పాటుకు ప్రయత్నించే అవకాశం ఉంది. బ్రెజిల్ సెలాక్ లో చేరుతుందని ఆయన ఇప్పటికే ప్రకటించారు, జనవరి చివరి వారంలో జరిగిన సమావేశానికి కూడా హాజరయ్యారు.

## బ్రిక్స్

లూలా విజయంతో కొత్త ప్రత్యామ్నాయ ప్రపంచ వ్యవస్థ కోసం లాటిన్ అమెరికా దేశాల సహకారం మరింత పెరిగే అవకాశం ఉంది. బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాల మొదటి అక్షరాలతో ఏర్పడిందే బ్రిక్స్) లోని చైనా, రష్యా ఉపాధ్యక్షులు, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి జనవరి 1న జరిగిన కొత్త అధ్యక్షుడు లూలా పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. హాజరు కానిది భారత దేశమే. ఈజిప్టు, టర్కీ, ఇరాన్, సౌదీ అరేబియా, ఇండోనీసియాలు బ్రిక్స్‌లో చేరడానికి సిద్ధమవుతున్నాయి. అమెరికా ప్రయోజనాలకు దూరంగా బ్రిక్స్ జరుగుతుండడం పట్ల భారత దేశం ఇబ్బంది పడుతోంది.

**పెరూలో కుట్రకు వ్యతిరేకంగా నిరసనలు:** పెరూలో ప్రజల చేత అధ్యక్షునిగా ఎన్నుకోబడిన వామపక్ష ఉపాధ్యాయుడు, యూనియన్ నాయకుడు పెడ్రో కాస్టిల్లోను ముగ్గురు న్యాయమూర్తుల తీర్పు పదవీ చ్యుతణ్ణి చేసింది. ఆయన అవినీతికి పాల్పడ్డారంటూ ఎటువంటి ఆధారాలు లేకుండా తీర్పు ఇచ్చారు. పెడ్రో కాస్టిల్లోను అధ్యక్ష పదవి నుండి తొలగించి ఆయన ఉపాధ్యక్షునిగా ఉన్న దీనా బోలార్టెను అధ్యక్షునిగా నియమించడంతో దేశంలో నిరసన వెల్లువలు తలెత్తాయి. పెడ్రో కాస్టిల్లోనూ

జైల్లో పెట్టి, ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలనీ, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అధ్యక్షునికి తిరిగి అధికారం అప్పగించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాపితంగా జరుగుతున్న ప్రజా నిరసనను నిరంకుశంగా అణచివేసి మితవాద శక్తులు అధికారం చేపట్టాయి. కొత్త ప్రభుత్వానికి పెరూలోని బూర్జువా పార్టీల్లో మెజారిటీ, చివరికి కాస్టిల్లోకు చెందిన ఫ్రీ పెరూ పార్టీ కూడా మద్దతిస్తున్నాయి.

57 ఏళ్ల క్రితం తమ దేశంలో కమ్యూనిస్టులపై “సామూహిక ఊచకోత” జరిపిన మాట వాస్తవమేనని ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో ఇటీవల ఒప్పుకున్నారు. 1965లో సుహార్తో నాయకత్వంలో కుట్ర జరిగిన తరువాత అమెరికా అండతో ఇండోనేసియా సైన్యం ఈ పరమ కిరాతకత్వానికి పాల్పడింది. కమ్యూనిజానికి వ్యతిరేకంగా అమెరికా సామ్రాజ్యవాద చేసిన యుద్ధంలో భాగంగా ఈ పైశాచికం జరిగింది.

దీన్ని ఒప్పుకోవడం, విచారం వ్యక్తం చేస్తే సరిపోదు. దీనికి బాధ్యులెవరో తేల్చాలి, న్యాయం చేయాలి.

## పొరుగు దేశాలు

**నేపాల్:** 2022 నవంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికలో ప్రస్తుత ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా నాయకత్వంలోని నేపాల్ కాంగ్రెస్ 89 స్థానాలు గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. 32 స్థానాలు గెలుచుకున్న పుష్ప కమాల్ దహాల్ “ప్రచండ” నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు సెంటర్) తోనూ, 10 స్థానాలు గెలుచుకున్న మాదవ్ కుమార్ నేపాల్ నాయకత్వంలోని ఎన్‌సిపి (సోషలిస్టు యునైటెడ్) తోనూ దేవ్‌బా కూటమి కట్టారు. 275 మంది సభ్యుల సభలో ఈ కూటమికి మెజారిటీకి రెండు స్థానాలు మాత్రమే తగ్గాయి. వాటిని అది స్వతంత్రుల నుండి పొందగలదు.

మాజీ ప్రధాని కెపి ఓలి నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యునైటెడ్ లెనినిస్ట్) 78 స్థానాలు గెలుచుకుంది.

ఎన్నికల ముందే పొత్తులు పెట్టుకున్న నేపాల్ కాంగ్రెస్, సిపిఎన్ (మావోఇస్టు సెంటర్) మధ్య తాము అధికారంలోకి వస్తే ప్రచండ, దేవ్‌బాలు రొటేషన్‌లో ప్రధాన మంత్రి పదవి చేపట్టాలని అంగీకారానికి వచ్చారు. ఎన్నికల తరువాత తాను ప్రధానిగా

ఉంటానని ప్రచండ పట్టుపట్టారు. కానీ నేపాలీ కాంగ్రెస్ ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించింది గనుక దేవ్‌బా దాన్ని తిరస్కరించారు. తాను మొదటి సగం టెర్మ్ ప్రధానిగా ఉంటానని ఆయన పట్టుపట్టాడు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి నేపాల్ అధ్యక్షురాలు పెట్టిన గడువు పూర్తికావస్తున్నా దేవ్‌బా, ప్రచండల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తొలగకపోవడాన్ని పసికట్టిన ఓలి ప్రచండకు తొలి టెర్మ్ ప్రధాన మంత్రి ఆఫర్ ఇచ్చి, తనూ, తన కూటమి భాగస్వామి అయిన రాచరిక–అనుకూల పార్టీతో చేతులు కలపాలని కోరారు. తన మద్దతు లేనిదే నేపాలీ కాంగ్రెస్ గానీ, ఎన్‌సిపి (యుఎంఎల్) గానీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేని స్థితిని ప్రచండ అవకాశంగా తీసుకున్నారు. దాంతో పార్లమెంటులో 32 మంది సభ్యులున్న ప్రచండ ప్రధాన మంత్రి అయ్యారు.

ఈ పరిస్థితుల్లో ప్రచండకూ, ఓలీకీ మధ్య ఉన్న గొడవలూ, రాచరిక పార్టీ నుండి వస్తున్న ఒత్తిళ్లతో ఈ ఏర్పాటులో అంతర్గతంగానే అస్థిరత ఉంది. అందువల్ల ఈ ఏర్పాటు ఎక్కువ కాలం నిలవక పోవచ్చు.

**పాకిస్తాన్:** పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉంది. విదేశీ మారక నిల్వలు 2014 తరువాత అత్యంత అధమ స్థాయికి చేరుకున్నాయి. వారి కరెన్సీ విలువ వేగంగా తగ్గిపోతున్నది. ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో మొత్తం ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. జనవరి నెలలో పెద్ద ఎత్తున విద్యుత్ కోతలు విధించారు. ఇప్పటికే గత ఏడాది కనీవిని ఎరుగని వరదలతో జనాభాలో 15 శాతం మంది అతలా కుతలం అయిన పరిస్థితుల్లో ఈ అదనపు భారాలు పాకిస్తాన్ ప్రజలను భరించలేని బాధల్లోకి నెడుతున్నాయి. 2019లో పాకిస్తాన్‌ను ఆర్థిక కష్టాల నుండి బయట పడేయడానికి ఐఎంఎఫ్ హామీ ఇచ్చిన 600 కోట్ల డాలర్ల ప్యాకేజీలో ఇంకా బకాయి ఉన్న 110 కోట్ల డాలర్ల మొత్తాన్ని విడుదల చేయడం కోసం పాక్ ప్రభుత్వం ఐఎంఎఫ్‌తో మంతనాలు జరుపుతోంది. తను పెట్టిన షరతులన్నిటినీ పాకిస్తాన్ ఆమోదించాలని ఐఎంఎఫ్ పట్టుపడుతోంది. విద్యుత్ సబ్సిడీలు ఉపసంహరించడం, గ్యాస్ ధరలను అంతర్జాతీయ మార్కెట్‌తో లింక్ చేయడం, 20,000 కోట్ల (పాకిస్తానీ) రూపాయల కొత్త పన్నులు విధించడం వంటి షరతులు ఇందులో ఉన్నాయి. ఈ షరతులు పాకిస్తాన్ ప్రజల మీదా, దాని పారిశ్రామిక, వ్యవసాయ రంగాల మీదా పుండుమీద కారంలా

మరిన్ని భారాలు మోపుతాయి. ఇప్పటికే ఈ రంగాలు వినాశకరమైన వరదలతో అతలాకుతలం అయి ఉన్నాయి. దీని వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ వాస్తవాన్ని విస్మరించిన ప్రభుత్వం ఐఎంఎఫ్ పెట్టిన ప్రధాన షరతులను ఆమోదించడానికి సుముఖత తెలిపింది.

ప్రజల్లో వస్తున్న ఈ అసంతృప్తిని ఉపయోగించుకుని గడువుకన్నా ముందుగానే వచ్చే ఎన్నికల్లో గెలుపు ఓడపై పయనించవచ్చని మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ ఆశిస్తున్నది. గడువుకాన్న ముందుగా ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను ఆయన పాకిస్తాన్‌లోని రెండు అతి పెద్ద రాష్ట్రాలైన పంజాబ్, ఖైబెర్ పఖ్తున్వాల ప్రాంతీయ శాసన సభలను రద్దు చేశారు. మరోవైపు ఉగ్రవాద చర్యలు దేశంలోని వేర్పాటువాద శక్తులకు ఊతం ఇస్తున్నాయి. ఇటీవల పెషావర్‌లోని ఒక మసీదుపై పాకిస్తాన్ తాలిబాన్లు చేసిన ఆత్మాహుతి దాడిలో వందమందికి పైగా మరణించారు. సైన్యం రాజకీయ క్రమంలో జోక్యం చేసుకోవడం వల్ల అక్కడ పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది రెండో పక్షంలో జరిగే ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మ్యాన్మార్ 2021 ఫిబ్రవరి 1న జరిగి సైనిక కుట్ర తరువాత దేశంలో అత్యవసర పరిస్థితి విధించి, అప్పటి దేశాధినేత, నోబుల్ బహుమతి గ్రహీత అయిన ఆంగ్ సాన్ సూ కీ నీ, నేషనల్ లీగ్ ఆఫ్ డెమోక్రసీకి చెందిన ఇతర నాయకులనూ అరెస్టు చేశారు. అప్పటి నుండి ప్రజలపై దాడులు మరింత పెరుగుతున్నాయి.

2022 డిసెంబర్‌లో ఆంగ్ సాన్ సూ కీ కి మరో ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. అంతకు ముందు ఆమెపై 26 ఏళ్ల జైలు శిక్ష విధించి ఉన్నారు. దాంతో మొత్తం శిక్ష 33 ఏళ్లు అయింది. తొలి దశలో గృహనిర్బంధంలో ఉన్న అమెను తరువాత జైలుకు తరలించారు, ఇప్పుడు ఒకే వ్యక్తిని ఉంచే సోలిటరీ కన్‌ఫైన్ మెంటుకు తరలించారు.

ఇటీవల మ్యాన్మార్ సైన్యం భారత సరిహద్దుకు చేరువలోని ఒక ముఖ్యమైన ప్రజాస్వామ్య అనుకూల సైనిక క్యాంపుపై దాడి చేసింది. భారత భూభాగంలో అటువంటి చర్యగానీ, దాడిగానీ జరగలేదని భారత రక్షణ అధికారులు ప్రకటించారు. సరిహద్దులో భారత దేశం వైపు బాంబుల పడ్డాయని బ్రిటన్‌కు మీడియా వార్తలు తెలిపాయి.

# జాతీయ పరిస్థితి

## భారతీయ ఆర్థికవ్యవస్థ

మాంద్యం పరిస్థితులు ముదురుతుండడంతో భారత ఆర్థిక వ్యవస్థ తడబాటుకు గురికావడం కొనసాగుతోంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నదని ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నప్పటికీ భారత దేశ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచే విధంగా పెట్టుబడులు పెరగడం లేదు. దానర్థం ఉపాధి కల్పన తగ్గకపోయినా స్తంభించిందన్నమాట. దీని వల్ల పేదరికం, ప్రజల ఈతిబాధలు పెరుగుతున్నాయి.

ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల గతంలో చెప్పినట్లు 6.9 శాతం కాకుండా 6.6 శాతం మాత్రమే ఉంటుంది.

2022లో ఐఎంఎఫ్ మూడు సార్లు భారత దేశ వృద్ధి రేట్లను 9 శాతం నుండి 7.4 శాతానికి, తరువాత 6.8 శాతానికి తగ్గించింది. 2023-24లో మరింత తక్కువగా 6.6 శాతనికి తగ్గుతుందని అంచనా వేసింది.

2022లో పారిశ్రామికోత్పత్తి తీవ్రంగా తగ్గింది. 2022 అక్టోబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 1.19 ఉంది. 2021 అక్టోబర్ తరువాత అతి తక్కువ. ఉత్పత్తిలో 5.4 శాతం తగ్గుదల కనిపిస్తోంది.

బ్యాంకు రుణాలు పెరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ దీన్ని క్యాపిటల్ ఖర్చులకు వినియోగించడం లేదని సిఎంఐఇ తెలిపింది. "2022-23లో వరుసగా 3వ ఆర్థిక సంవత్సరంలో కూడా కార్పొరేట్లు తమ ఉత్పాదక సామర్థ్యాల విస్తరణ మీద ఖర్చు చేయనట్లు కనిపిస్తోంది" అని అది పేర్కొంది. దీనికి ప్రధాన కారణం, ప్రపంచ వాణిజ్యం తగ్గడంతోపాటు దేశీయంగా గిరాకీ లేకపోవడం కూడా. గిరాకీ లేకపోడానికి కారణం పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వల్ల భారత ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోవడం.

ద్రవ్యోల్బణం రేటు తగ్గుతున్నప్పటికీ ఇప్పటికీ అది చాలా హెచ్చుగానే ఉందని ఆర్‌బిఐ పేర్కొంది. ప్రస్తుతమున్న 6-7 శాతం నుండి ద్రవ్యోల్బణం 4 శాతానికి తగ్గితేగానీ దేశీయ గిరాకీ తిరిగి పెరిగే అవకాశం లేదని అది తెలిపింది.

**నిరుద్యోగం:** డిసెంబర్‌లో భారత దేశ నిరుద్యోగం గత నెలలో 8 శాతం నుండి 8.30 శాతానికి పెరిగిందని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షక కేంద్రం నుండి లభించిన గణాంకాలు చెబుతున్నాయి. 16 మాసాల్లో నిరుద్యోగం ఇంతగా పెరగడం ఇదే మొదటి సారి. పట్టణ నిరుద్యోగం గత మాసంలో 8.96 శాతం నుండి ఈ

మాసం 10.09 శాతానికి పెరిగింది. గ్రామీణ నిరుద్యోగ శాతం 7.55 శాతం నుండి 7.44 శాతానికి తగ్గిందని గణాంకాలు తెలుపుతున్నాయి. ఉపాధి రహిత ఆర్థిక వ్యవస్థలో ఆర్థికాభివృద్ధి జరిగినా కూడా నిరుద్యోగం ఎక్కువగానే ఉంటుంది. సాపేక్షంగా చాలా మంది ప్రజలు ఇప్పటికే ఉద్యోగాలు కోల్పోయిన పరిస్థితుల్లో తిరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నప్పటికీ నిరుద్యోగులనూ, పాక్షిక ఉద్యోగులనూ, మొదటి సారి ఉద్యోగ సైన్యంలో చేరిన వారికీ ఉద్యోగాలు కల్పించ గలిగే స్థితి ఉండదు. ఎవరైనా ఉద్యోగం సంపాదించినప్పటికీ వారి మెడమీద ఉద్యోగ భద్రత ప్రమాదం నిత్యం వేలాడుతూనే ఉంటుంది. ఎందుకంటే వారి ఉద్యోగాలు శాశ్వతంగా ఉంటాయన్న గ్యారంటీ ఉండదు, లేకపోతే వారికి సాంఘిక భద్రతా ప్రయోజనాలు అందుతాయన్న గ్యారంటీ ఉండదు.

**ఎంజిఎన్ఆర్ఇజిఎస్:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి గ్యారంటీ చాలా అవసరమైన కాలంలోనే ఉపాధి గ్యారంటీ పథకానికి తీవ్రమైన కోతలు పెడుతుండడం నేరపూరిత చర్య, ఒక కుటుంబానికి ఉపాధి కల్పించే సగటు రోజులు గత ఐదేళ్లలో అతి తక్కువకు చేరాయి. వేతనాల చెల్లింపుల్లో జాప్యాలు, నిధుల్లో కోత విధించడం మొదలైనవి గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గండి కొడుతున్నాయి.

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకానికి కేటాయింపులను కనీసం ఏడాదికి రూ. 2 లక్షల కోట్లు చొప్పున పెంచాలి.

ఉద్యోగాలు గ్యారంటీ చేసే ప్రాథమిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెద్ద ఎత్తున పెంచనిదే ఉద్యోగ కల్పనగానీ, ప్రజల కొనుగోలు శక్తి గానీ పెరగదు.

**అసమానతులు వికృతంగా పెరగడం:** 'కుభేరుల మనుగడ: భారత దేశ అనుబంధం' అన్న శీర్షికతో వెలువడిన ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం భారత దేశానికి చెందిన 40 శాతం సంపద 1 శాతం జనాభా సొంతం చేసుకుంది. 2022లో పది మంది అతి కుభేరులైన భారతీయుల దగ్గర రూ. 27.52 లక్షల కోట్ల సంపద ఉంది. 2021 నుండి వీరి సంపద 32.8 శాతం పెరిగింది. జనాభాలో అట్టడుగునున్న 50 శాతం మంది దగ్గర 3 శాతం సంపద మాత్రమే ఉంది.

భారత దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య ఏడాది ముందు 102 మంది నుండి 2022 నాటికి 166కి పెరిగిపోయింది. దీనికి భిన్నంగా 23 కోట్ల మంది ప్రజలు – ప్రపంచంలోనే అత్యధిక మంది – పేదరికంలో జీవిస్తున్నారు.

భారత దేశంలో తిరోగమన పన్ను వ్యవస్థను గురించి నివేదిక పేర్కొంటూ మన ప్రజల్లోని అట్టడుగునున్న 50 శాతం మంది ప్రజలు పరోక్ష పన్నుల ద్వారా వచ్చే అదాయంలో అగ్రస్థానంలో ఉన్న 10 మంది కన్నా 6 రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారని తెలిపింది. ఆహారం, ఆహారేతర నిత్యావసరాల ద్వారా వసూలు చేసే పన్నుల్లో 64.3 శాతాన్ని అట్టడుగునున్న 50 శాతం మంది పేదలు చెల్లిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం ధనికులకు ఇస్తున్న రాయితీను వెనక్కు తీసుకోడానికీ, సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడానికీ, అన్ని నిత్యావసరాల మీద ముఖ్యంగా ఆహార వస్తువుల మీద జిఎస్‌టి రద్దు చేయడానికీ ఇదే మంచి తరుణం.

## అదానీ గ్రూపుపై ఆరోపణలు

హండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ గ్రూపుపై చేసిన ఆరోపణలు విచారించడానికి ఒక ఉన్నత స్థాయి దర్యాప్తు సంఘాన్ని నియమించడం, సుప్రీం కోర్టు దాన్ని రోజువారీ పద్ధతిలో పర్యవేక్షించడం అవసరం. ఈ దర్యాప్తు పూర్తయి నిజాలు బయపడేవరకు భారత ప్రజల ప్రయోజనాలు రక్షించాలి. ఎల్‌ఐసికి చెందిన రూ. 80,000 కోట్ల రూపాయలు అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టారు. అన్ని జాతీయ బ్యాంకుల నుండి ఆ గ్రూపు తీసుకున్న రుణాల్లో 40 శాతాన్ని ఎస్‌బిఐ ఇచ్చింది. ఎల్‌ఐసి, ఎస్‌బిఐ లలో కోట్లాది మంది భారతీయులు తాము జీవితాంతం కూడబెట్టుకున్న సొమ్మును భవిష్యత్తు భద్రత కోసం దాచుకుంటారు. ఈ నివేదిక బయటపడ్డంతోనే స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు షేర్ల ధరలు 5,000 కోట్ల మేర పతనమయ్యాయి. దీని వల్ల ప్రజలు జీవితాంతం కూడబెట్టి ఈ ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టిన పెట్టుబడులు నాశనం కాకూడదు.

మన పార్టీ ఇతర లౌకిక ప్రతిపక్ష పార్టీలతో సమన్వయం చేసుకుని పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతుంది.

## మరింత తీవ్రమవుతున్న మత విభజన

మతాల మధ్య విభజన పెంచే ప్రయత్నాలు అనేక మార్గాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. తమ రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ ప్రకటించాయి. దీని వెంటనే ముస్లిం పెర్సనల్ లాను రద్దు చేస్తామన్న దురుసు వ్యాఖ్యానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ మేరకు బిజెపి సభ్యుడొకరు రాజ్య

సభలో ఒక ప్రయివేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. ఇప్పటికే బిజెపి పాలిత రాష్ట్రాలన్నిటి లోనూ రాష్ట్ర ప్రభుత్వాలు 'లవ్ జిహాద్', లేక 'గోరక్షణ' పేరుతో ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా చట్టాలు చేశాయి. ఈ చట్టాల్లో ఎలాంటి నిబంధనలు పెట్టాయంటే తమంత తాముగా ఎవరైనా మతం మారడానికీ గానీ, మతాంతర వివాహాలు చేసుకోడానికి గానీ దాదాపు వీలు లేకుండా చేశాయి.

ఆర్ఎస్ఎస్ వారపత్రికలకు ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ ఇచ్చిన తీవ్ర అభ్యంతరకరమైన ఇంటర్వ్యూ భారత రాజ్యాంగాన్నీ, పౌరులందరికీ సమాన హక్కులనూ, చట్టం న్యాయాలనూ పచ్చిగా సవాలు చేసే విధంగా ఉంది. ముస్లిం మైనారిటీలు భద్రంగా ఉండాలంటే వారు 'అధిపత్య' భావాలు వదులుకోవాలని ఆయన బెదిరించారు. చారిత్రక తప్పిదాలుగా వారు కనిపెట్టిన వాటికి 'హిందూ సమాజం' ప్రతీకారం తీర్చుకోవడం సరైందేనని సమర్థించుకున్నారు. హిందువులు 'యుద్ధంలో ఉన్నారు' అని ఆయన అన్నారు. భారతీయ పౌరుల్లో కొన్ని సెక్షన్ల మీద మత ప్రాదిపదికపై హింసాకాండ జరపాలని ఆయన దాదాపు పిలునిచ్చారు.

ముస్లింలు రెండవ తరగతి పౌరులుగా అణిగి ఉంటేనే ఈ దేశంలో ఉండడానికి అనుమతించబడతారు అని హెగ్డేవార్, గోల్వాల్కర్ వంటి ఆర్ఎస్ఎస్ నేతలు చేసిన మత విద్వేషపూరిత హెచ్చరికలనే భగవత్ సరికొత్త ప్రకటన రూపంలో చేశారు.

విద్యా సంస్థల్లో ముస్లిం విద్యార్థులకు వ్యతిరేకంగా ప్రమాదకరమైన రీతిలో విద్వేషాన్ని ఎక్కిస్తున్నారని అనేకానేక వార్తలు వస్తున్నాయి. కర్నాటక లోని మణిపాల్ విశ్వవిద్యాలయంలో ఒక ముస్లిం విద్యార్థిపై ఉగ్రవాది అని ముద్ర వేశారు. ఇది సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఇది ఏదో విడిగా జరిగిన ఘటన కాదు. ముస్లిం విద్యార్థులను నిత్యం ఉగ్రవాదులుగా పేర్కొనడం, వారు ముస్లింలైనందుకు విమర్శించడం జరుగుతోంది. ఒకవైపు విషపూరితమైన విద్వేష ప్రచారం దాంతోపాటు ఏదో ఒక పేరు చెప్పి ముస్లింలపై హింసాకాండకు పాల్పడ్డం విద్యాసంస్థల్లో తరచూ జరుగుతున్నాయి. గుజరాత్‌లో మఫ్టీలో ఉన్న పోలీసులు ముస్లిం యువతను కొరడాలతో కొట్టడం ఇటువంటి ఘటనల్లో భాగం.

మౌలానా అజాద్ నేషనల్ ఫెల్లోషిప్ (ఎంఎఎన్ఎఫ్) పేరుతో ముస్లిం విద్యార్థులకు ఇచ్చే ఫెల్లోషిప్‌లను, స్కాలర్ షిప్ పథకాలనూ మోడీ ప్రభుత్వం రద్దు చేసినట్లు పార్లమెంటులో ప్రకటించారు. సచార్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా

యుపిఎ 1 ప్రభుత్వం ఈ ఎంఎఎన్ఎఫ్ పథకాన్ని అమలు చేసింది. 2014–15 నుండి 2021–22 మధ్య ఈ ఫెల్లోషిప్‌కు 6,722 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారికి రూ. 738.85 కోట్లు ఇచ్చారు. ఎంఎఎన్ఎఫ్ ఇతర అనేక స్కాలర్‌షిప్ పథకాలతో ఓవర్‌లాప్ అవుతోంది గనుక ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. ఇది పూర్తిగా అవాస్తవం. అనేక రాష్ట్రాల్లో ముస్లింలు, ఇతర మతపరమైన మైనారిటీలను ఓబిసిలుగా గుర్తించడం లేదు. ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని పునరుద్ధరించాలి.

తదుపరి, మోడీ ప్రభుత్వం ఇప్పుడు విదేశాల్లో చదువుతున్న మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే వడ్డీ సబ్సిడీ పథకాన్ని (పడో పరదేశ్) కూడా అమలు చేయడం ఆపేసింది. ఈ పథకాన్ని 2006లో సచార్ కమిటీ నివేదిక తరువాత అమలు చేయడం ఆరంభించారు. నోటిఫై చేసిన మైనారిటీ మతస్తుల్లో బలహీన వర్గాలకు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించడం కోసం ఈ పథకాన్ని అమలు చేశారు.

ఇటీవల దేశవ్యాపితంగా వివిధ పార్లమెంటు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మైనారిటీలను ఓటింగుకు రాకుండా అడ్డుకున్నట్లు ఆందోళన కరమైన వార్తలు వచ్చాయి. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ లోని రామ్‌పూర్ శాసన సభ నియోజకవర్గంలో ఇది జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు మౌలిక రాజ్యాంగ గ్యారంటీలు లేకుండా చేయడం ద్వారా మతవిద్వేష పూరిత విధానాలను అమలు చేస్తోంది. ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఒక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అల్లామ ఇక్బాల్ రాసిన ప్రజాదరణ పొందిన ఉర్దూ గీతాన్ని పాడినందుకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు.

చత్తీష్‌ఘర్‌లోని ఉత్తర బస్తర్ జిల్లాలో క్రిస్టియన్ మతస్తులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయి. ఎటువంటి ఆధారాలు లేకుండా బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయన్న ప్రచారంతో ఇటువంటి దాడులు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఒక్క బలవంతపు మతమార్పిడి కేసు కూడా నమోదు కాలేదు. క్రైస్తవ మతస్తులను లక్ష్యంగా చేసుకుని నడుపుతన్న ఎజెండాలో భాగంగా ఇదంతా జరుగుతున్న దన్న విషయం స్పష్టం. ఆర్ఎస్ఎస్/బిజెపి అండతో బజరంగదళ్ తాము ప్రారంభించిన 'ఘర్ వాపసీ' అంగీకరింపజేయడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగం ఇది. ముఖ్యంగా మహిళలు, పిల్లలపై హింసాత్మక దాడులకు పాల్పడుతున్నారు. ఆదివాసీలు అటవీ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా ఐక్యంగా చేస్తున్న ఉద్యమాన్ని

బలహీనపరచడానికి కూడా ఈ దాడులు ఉద్దేశించబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తగినంత శ్రద్ధతో ఈ నేరపూరిత దాడుల సమస్యను పరిష్కరించబూనుకోవడం లేదు.

**ప్రజాస్వామ్యంపై దాడులు:** పార్టీ 23 మహాసభ రాజకీయ తీర్మానంలో ప్రస్తావించిన విధంగా ప్రజాస్వామ్యంపైనా, ప్రజాస్వామ్య హక్కులపైనా దాడులు కొనసాగుతున్నాయి.

అన్ని రాష్ట్రాలకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డిజిపి)లు తమ రాష్ట్రాల్లో శాంతి–భద్రతలపైనా, వాటిపై వారి అభిప్రాయాలపైనా సమర్పించే పత్రాలను వెబ్‌సైట్‌ల నుండి తొలగించాలని ఇటీవల జరిగిన దేశవ్యాపిత డిజిపిల సమావేశంలో బిజెపి ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలు ఎందుకిచ్చారంటే.. డిజిపిలు సమర్పించే అనేక పత్రాల్లో మితవాద హిందూత్వ సంస్థలు ఆయా రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయన్న సమాచారం ఉంటోంది కనుక.

**లైంగిక వేధింపులు జరిపేవారికి రక్షణ :** బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మహిళలపైన చివరికి అంతర్జాతీయ టోర్నమెంట్లలో పతకాలు సాధించిన మహిళలపైన కూడా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వంగానీ, పాలక పార్టీగానీ ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలి జీవిత ఖైదుకు అనుభవిస్తున్నవారికి ఉపశమనం లభించిన వెంటనే పూనేలో 2014 జూన్‌లో మొహిసిన్ షేక్ కేసులో హింసాకాండకూ, హత్యాకాండకూ పాల్పడిన 21 మందిని కూడా శిక్షనుండి విముక్తిచేశారు. దీనికి హిందూత్వ సంస్థలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశాయి. పోలీసుగానీ, ప్రభుతంగానీ దీనిపై పైకోర్టుకు వెళ్లలేదు.

## పిఎంజికెఎవై క్రింద 5 కిలోల ఆహారధాన్యాలు, ఎఫ్ఎస్ఎ క్రింద 5 కిలోల సబ్సిడీ బియ్యం పునరుద్ధరించాలి

2013 ఆహార భద్రత చట్టం క్రింద దాదాపు దేశంలోని మూడింట రెండొంతుల ప్రజలకు 2023లో 'ఉచిత' రేషన్ సరఫరా చేశారు. దేశం ఆకలి కోరల్లో ఉందనీ, ఈ పనిచేయడం ద్వారా మినహా ఆకలి నుండి ప్రజలను విముక్తి చేయడం సాధ్యకాదన్న విషయాన్ని ఇది రుజువు చేస్తోంది. మోడీ ప్రభుత్వం ఎంతగా తిరస్కరిస్తున్నప్పటికీ ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం భారత దేశంలో ఆకలి "చాలా తీవ్రంగా" ఉంది.

ప్రభుత్వం ఎఫ్ఎస్ఎ, పిఎంజికెఎవై పథకాలు రెంటినీ విలీనం చేసి 81.35 కోట్ల మంది ప్రజలకు 5 కిలోల ఆహార ధాన్యాలు ఉచితంగా ఇస్తోంది. దానివల్ల ఎఫ్ఎస్ఎ పథకం క్రింద ఇచ్చే 5 కిలోల సబ్సిడీ ఆహార గింజలకు మంగళం పాడింది. ఈ పథకం క్రింద 3 రూపాయలకు కిలో బియ్యం, రెండు రూపాయలకు కిలో గోదుమలు, ఒక రూపాయికి కిలో చిరుధాన్యాలు ఇచ్చేవారు కాస్తా దాన్ని ఇప్పుడు లేకుండా చేశారు. ప్రజల పౌష్టికాహారం కొనసాగించడానికి అత్యవసరమైన ఈ అదనపు 5 కిలోల ఆహార ధాన్యాల కోసం వారు బహిరంగ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కిలో గోదుమలు రూ.30కి పైగా, కిలో బియ్యం రూ. 40 పైగా అమ్ముడవుతున్నాయి. గతంలో 5 కిలోల బియ్యం 15 రూపాయలకు కొనాల్సిన ప్రజలు ఇప్పుడు వాటి కోసం రూ. 200కి పైగా, 5 కిలోల గోదుమలకు రూ.10 ఖర్చు చేసేవారు ఇప్పుడు వాటికోసం రూ. 150కి పైగా ఖర్చు చేయాల్సి రావడం దారుణమైన విషయం.

## న్యాయ వ్యవస్థ స్వతంత్రతను వమ్ముచేయడం

మోడీ ప్రభుత్వం ఇటీవలి మాసాల్లో దేశంలోని అత్యున్నత న్యాయవ్యవస్థపైన కూడా నిరంకుశంగా వ్యవహరిస్తోంది. తనకు 'తలొగ్గి' ఉండే న్యాయవ్యవస్థ కోసం ప్రభుత్వం హైకోర్టులు, సుప్రీం కోర్టులకు న్యాయమూర్తుల నియామకం విషయంలో కూడా జోక్యం చేసుకుంటోంది. సుప్రీం కోర్టు, హైకోర్టు కొల్లీజియంలు సిఫార్సు చేసిన వివిధ పేర్లను ఆలస్యం చేయడం, లేక తిరస్కరించడం ద్వారా అది ఈ జోక్యానికి పాల్పడుతోంది.

న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు కొల్లీజియం వ్యవస్థమీద దాడి చేయడం ప్రారంభించారు. 2022 నవంబర్‌లో ఆయన న్యాయమూర్తుల నియామకంలో కార్యనిర్వాహక వ్యవస్థను భాగస్వామిని చేయకపోవడంపై విరుచుకు పడ్డారు. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుందని న్యాయ శాఖ మంత్రి డిమాండ్ చేశారు. న్యాయమూర్తుల నియామకం కోసం కొల్లీజియంలో ప్రభుత్వ ప్రతినిధిని కూడా చేర్చడం కోసం ఒక కొత్త "సెర్చ్ అండ్ ఇవాల్యుయేషన్ కమిటీ"ని ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. ఈ విధమైన చర్యల ద్వారా న్యాయవ్యవస్థపై ప్రభుత్వం దాడులను పెంచింది.

కొత్తగా ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన జగదీప్ ధన్‌ఖర్ తను రాజ్యసభాధ్యక్షునిగా ఉన్న తొలి సమావేశంలోనే జాతీయ న్యాయమూర్తుల నియామక కమిటీ చట్టాన్ని

రద్దు నిర్వీర్యం చేసినందుకు సుప్రీం కోర్టును విమర్శించారు. పార్లమెంటుకు సర్వం సహాధికారం ఉందని ప్రకటించారు. కేశవానంద భారతి కేసులో సుప్రీం కోర్టుకు ఆదేశించిన 'మౌలిక నిర్మాణం' సూత్రాన్నే ఆయన తరువాత తిరస్కరించారు. తద్వారా ఆయన పార్లమెంటుకు రాజ్యాంగాన్ని ఏవిధంగానైనా సవరించుకునే హక్కు ఉందనీ కోర్టులకు ఇందులో జోక్యం చేసుకునే హక్కులేదనీ చెప్పకనే చెప్పినట్లయింది.

కొల్లీజియం పద్ధతిని మన పార్టీ కూడా విమర్శించింది. అయితే మనం విస్తృత ప్రాతిపదిక గల జాతీయ న్యాయ కమిషన్ ఉండాలని కోరుతున్నాం. ఇది న్యాయమూర్తుల నియామకం, బదిలీలతో సహా న్యాయవ్యవస్థకు సంబంధించిన సమస్యలన్నిటినీ చేపడుతుంది. కానీ ప్రభుత్వం కొల్లీజియం పద్ధతిని రద్దు చేసే పేరుతో న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టబూనుకుంటున్నది. ఇది ఆమోద యోగ్యం కాదు. ఉన్నత న్యాయవ్యవస్థను కార్యనిర్వాహక వర్గ ఆదేశాల ప్రకారం నడుచుకునేట్టు చేయడం మోడీ ప్రభుత్వ లక్ష్యం. న్యాయవ్యవస్థ స్వతంత్రం పోతే మన రాజ్యాంగ ఏర్పాటు ప్రకారం నిరంకుశత్వం పూర్తి ఆధిపత్యానికి వస్తుంది. న్యాయవ్యవస్థపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా శక్తివంతమైన ప్రచారాందోళన నిర్వహించాలి. ఉన్నత న్యాయవ్యవస్థ రాజ్యాంగ బాధ్యతలను సమర్థించేందుకు అన్ని రకాల ప్రజాతంత్ర శక్తులను సమీకరించాలి.

## గవర్నర్ల పాత్ర

బిజెపి యేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు తమ రాజ్యాంగ విధులను ఉల్లంఘించి పాలక పార్టీ రాజకీయ లక్ష్యాలు నెరవేర్చడం కోసం ఫెడరలిజం మీద దాడులు ఉద్ధృతం చేస్తున్నారు. కేరళ, తెలంగాణా, మహారాష్ట్ర ఇప్పుడు తమిళనాడు గవర్నర్లు, ఢిల్లీ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, పాండిచేరి కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు తమ రాజ్యాంగ విధులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. కేరళ గవర్నరు రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా ఇంకా తొక్కిపట్టి ఉంచారు.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని అసెంబ్లీలో చదివేటప్పుడు కొన్ని అంశాలు వదిలిపెట్టేశారు. దాంతో గవర్నరు చదివిన ప్రసంగం కాకుండా అసెంబ్లీలో పంపిణీ చేసిన పత్రమే అధికార ప్రసంగంగా పేర్కొంటూ ముఖ్యమంత్రి శాసన సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది.

గవర్నర్ రవి ఈ విధంగా చేయడం ద్వారా గవర్నర్ అనేవారు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ గళంలాగా ఉండాలన్న రాజ్యాంగ సూత్రాన్నీ, రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగాన్ని ఆయన పూర్తిగా చదవాలన్న దీర్ఘకాలం నుండి వస్తున్న ఆనవాయితీని ఉల్లంఘించారు. ప్రసంగంలో ఆయన వదిలి పెట్టిన భాగం అంతకు ముందు ఆయన ఆమోదించినదేనని ఇప్పుడు స్పష్టమైంది.

శాంతి భద్రతల అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. దీని మీద వచ్చిన అంశాలను వదిలేయడం ద్వారా గవర్నరుకు శాంతి భద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ మంచి రికార్డు పట్ల విముఖత ఉన్నట్లు వెల్లడయింది. తమిళనాడులోని మహత్తర సాంఘిక సంస్కర్తల సేవలను గురించిన అంశాలను కూడా ఆయన వదిలిపెట్టేశారు.

బిజెపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగ పాత్రను వమ్ముచేయడానికి గవర్నరు పదవులను ఎలా వినియోగించుకోవడం జరుగుతోందో చెప్పడానికీ, పెరుగుతున్న ఫెడరల్ వ్యతిరేక, అధికారాల కేంద్రీకరణ ధోరణులకూ గవర్నర్ రవి చర్యలు మంచి ఉదాహరణలు.

## అస్సాం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ

అస్సాం రాష్ట్రంలోని అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పారంభించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్ణయించింది. రాష్ట్రంలోని పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు 2001 జనాభా లెక్కలను ప్రాతిపదికగా ఉపయోగించాలనే వైఖరిని అది తీసుకుంది. ఇందుకోసం కమిషన్ తన స్వంత మార్గదర్శకాలు, పద్ధతులను రూపొందించి, ఖరారు చేస్తుంది.

అస్సాంలో చివరి సారి నియోజకవర్గాల పునర్విభజన 1976లో జరిగింది. దీనికి 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకున్నారు.

2001 జనాభా లెక్కల ఆధారంగా 2023లో జరిగిన డీలిమిటేషన్‌ను మూడు వామపక్ష పార్టీలు – సిపిఐ(యం), సిపిఐ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ – ఉమ్మడిగా వ్యతిరేకించాయి. ఇరవై ఏళ్ల కిందటి జనాభా లెక్కల ఆధారంగా అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్వచించడంవల్ల పెద్దగా ఎలాంటి ఉపయోగమూ ఉండదు.

2001 జనాభా లెక్కల ఆధారంగా డీ–లిమిటేషన్ చేపట్టడం వెనుక కేంద్రం, రాష్ట్రంలోని అధికార పార్టీ ప్రయోజనాలు దాగి ఉన్నాయి. అందుకే అది ఈ డీ–లిమిటేషన్ పట్ల ఎక్కడలేని ఆత్రుతను ప్రదర్శిస్తున్నది. డీ–లిమిటేషన్ ప్రక్రియను ఎన్నికల సంఘం ప్రారంభించిన వెంటనే, అస్సాం ప్రభుత్వం దీనిని తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే పన్నాగంలో భాగంగా నాలుగు జిల్లాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పాలనా యూనిట్ల ఏర్పాటుపై ఎన్నికల సంఘం విధించిన నిషేధం అమల్లోకి రాకముందే ఈ నాలుగు జిల్లాలు హొజాయ్, బిస్వనాథ్ చారియాలీ, బజలి, తముల్పూర్‌లను హడావుడిగా రద్దు చేయడంలో ఆంతర్యమిదే. కొత్తపాలనా యూనిట్లు పునర్నిర్వచించడానికి 2023, జనవరి1 నుండి అమలులోకి వచ్చేలా ఎన్నికల సంఘం సరిహద్దులను స్తంబింపచేస్తూ ఆదేశాలు ఇవ్వడానికి ఒక రోజు ముందు 142 గ్రామాల పరిపాలనా పరిధిని అస్సాం ప్రభుత్వం మార్చడం కూడా దీనిలో భాగమే.

వాస్తవానికి, రాజ్యాంగంలోని 84వ సవరణలోని నిబంధనలు తదుపరి దేశవ్యాప్త డీలిమిటేషన్ ప్రక్రియతోపాటే అస్సాంలోని అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్విభజించవచ్చని స్పష్టంగా పేర్కొన్నాయి.

## సహకార బిల్లు–ఫెడరలిజంపై దాడి

మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీల సవరణ బిల్లు–2022 అనేది సమాఖ్యవాదం, రాష్ట్రాల హక్కులపై దాడి. సహకార సంఘాలు రాష్ట్రానికి సంబంధించినవి. రాష్ట్ర చట్టాలకు అనుగుణంగా పనిచేసే సహకార సంఘాలపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను బలవంతగా రుద్దడమే ఈ ప్రతిపాదిత బిల్లు ముఖ్యోద్దేశం. ఇది సహకార సంఘాలను నియంత్రించే ఎత్తుగడ తప్ప మరొకటి కాదు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను దెబ్బతీయడమే గాక, సమాఖ్యవాదంపైనా ఇది దాడి చేస్తుంది.

## యుజిసి మార్గదర్శకాలు

భారతదేశం 'ప్రజాస్వామ్యానికి తల్లి' అని ప్రధానమంత్రి ఎర్రకోట బురుజు నుండి ప్రకటించడమే తడవుగా యుజిసి చైర్‌పర్సన్ ప్రాచీన భారతదేశంలోని ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు ఆదర్శంగా రాజులను, ఖాప్ పంచాయతీలను చూపుతూ వాటిపై ఉపన్యాసాలు దంచేలా రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలను

ప్రోత్సహించాలని గవర్నర్లందరికీ లేఖలు రాశారు. విదేశీ పాలకులు (ముస్లిం పాలకులు అని అర్థం) దండయాత్రల వల్ల భారతదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విఘాతం ఏర్పడినట్లు చూపే ప్రయత్నం చేస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని అవహాస్యం చేసే మరో అంశమేమిటంటే పురాతన భారతదేశంలో ఎలాంటి నిరంకుశత్వం కానీ, కులీన వ్యవస్థ కానీ లేదని చెప్పడం. ఇటువంటి అన్ని అహేతుకతలతోపాటు ఆధునిక ప్రజాస్వామ్య అభివృద్ధికి ప్రధాన సవాలు విసురుతూ వస్తున్న నిచ్చెన మెట్ల లాంటి కుల ఆధారిత సామాజిక వ్యవస్థ సామాజిక అణచివేత వంటి వాస్తవికతను అది తిరస్కరించడం.

మానవ నాగరికతలో పెట్టుబడిదారీ విధానం పెరుగుదలతో భూస్వామ్య రాజ్యాలు, సామ్రాజ్యాలు విచ్ఛిన్నమైన క్రమంలో 'పాలకుడు, పాలితుడు అనే రాజకీయ మనస్తత్వం స్థానే 'రాజ్యం', 'పౌరుడు' అనేవి వచ్చాయి. ఇవే ప్రజాస్వామ్య అభివృద్ధికి పునాదులు.

నూతన విద్యా విధానం, యుజిసి మార్గదర్శకాలు ఈ రెండూ హేతుబద్ధత, హేతువు, శాస్త్రీయ దృక్పథంపై హిందూత్వ మతతత్వవాదుల దాడులను ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన సాధనాలుగా ఉన్నాయి.

## భీమా కొరెగావ్ ఖైదీలను విడుదల చేయాలి

2018 జనవరి 1న భీమా కోరేగావ్‌లో చోటుచేసుకున్న కుల హింసను పరిశోధిస్తున్న సీనియర్ పోలీసు అధికారి ఒకరు దీనికి సంబంధించి తిరుగులేని వాస్తవాన్నొకదానిని వెల్లడించారు. అదేమిటంటే పూణె నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో నిర్వహించిన ఎల్గార్ పరిషత్ కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న హింసలో ఈ కేసులోని నిందితులుగా పేర్కొంటున్నవారికెవరికీ ఎటువంటి పాత్రలేదని ప్రమాణ పూర్వకంగా ఇచ్చిన వాగ్మూలంలో అంగీకరించడం.

అంతేకాదు, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఫోరెన్సిక్ విశ్లేషణ సంస్థలచే నిందితుల పరికరాలపై ఫోరెన్సిక్ విచారణ తర్వాత ఇప్పటివరకు ఐదు నివేదికలచ్చాయి. అవన్నీ బహిరంగంగానే ప్రజల ముందున్నాయి. ఈ విచారణలో తేలిందేమిటంటే ఎవరినైతే లక్ష్యంగా చేసుకున్నారో వారి కంప్యూటర్లలో నకిలీ ఫైళ్లను హ్యాకింగ్ ద్వారా చొప్పించారు. నిందితులుగా పేర్కొనబడుతున్న వారికి ఆ ఫైళ్ల గురించి అసలు తెలియదు. వారు ఆ ఫైళ్లను ఎన్నడూ తెరిచి చూడనే లేదని ఫోరెన్సిక్ విచారణలో

తేలింది. అయినప్పటికీ, ఈ నకిలీ ఫైళ్లే భీమా కొరెగావ్ కేసులో నిందితులందరికీ వ్యతిరేకంగా ప్రధాన సాక్ష్యంగా చూపించి, వారిని క్రూరమైన యుఎపిఎ చట్టం కింద నిర్బంధించారు.

అందుకే, ఈ కేసుకు సంబంధించి అరెస్టయిన యుఎపిఎ ఖైదీలనందరినీ బేషరతుగా తక్షణమే విడుదల చేయాలి.

## జి-20కి భారత్ సారథ్యం

జి- 20కి భారత్ నేతృత్వం వహించడాన్ని అవకాశంగా తీసుకుని ప్రపంచంలోని అత్యంత ప్రభావ వంతమైన దేశాలు ఆమోదించిన గ్లోబల్ లీడర్‌గా తనను తాను చాటింపు వేసుకోడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. 2023 సెప్టెంబరులో జరిగే జి-20 శిఖరాగ్ర సమావేశానికి ముందు దేశంలో వివిధ ప్రాంతాల్లో ఈవెంట్లను నిర్వహిస్తోంది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పబ్బం గడుపుకోడానికి వీటిని వాడుకోవాలని అది చూస్తున్నది. జి-20 అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు రావడంలో ఎలాంటి ప్రత్యేకత లేదు. రొటేషన్ పద్ధతిలో జి-20లోని ప్రతి దేశానికి ఈ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే వంతు వస్తుంది. అప్పుడు అవి తన బాధ్యతను నిర్వర్తిస్తాయి.ఆ విధంగానే భారత్‌కు ఈ అవకాశం వచ్చింది.

జి-20 అనేది 1999లో దక్షిణాసియా ఆర్థిక సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో ఏర్పడింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలను అనుసరించే అనివార్యంగా తరుముకొచ్చే సంక్షోభం తాలూకు భారాలను అభివృద్ధి చెందుతున్న దేశాల నెత్తిన వేసేందుకు సంపన్న దేశాలు పన్నిన ఎత్తుగడే ఈ జి-20 వేదిక.

2008లో ప్రపంచ ఆర్థిక మాంద్యం తలెత్తినప్పుడు మంత్రుల స్థాయి సంప్రదింపుల సమావేశంగా తొలుత మొదలై తుదకు ప్రభుత్వ అధినేతల సమావేశంగా మారింది. అప్పటి నుండి దేశీయ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులతో అంతగా సంబంధం లేని రొటేషన్ పద్ధతిలో ఈ కూటమి అధ్యక్ష బాధ్యతలు ఒక దేశం తరువాత మరొక దేశానికి అప్పగించడం జరుగుతోంది.

'ఒక భూమి- ఒక కుటుంబరా ఒక భవిష్యత్తు' అనే అంశం చుట్టూ దేశీయ రాజకీయ ప్రచారాన్ని తిప్పుతూ మోడీ ఒక కార్యక్రమాన్ని ప్రకటించారు. 'ఏకత్వం అనే విశ్వజనీన భావనను పెంపొందించేందుకు జి-20 ప్రెసిడెన్సీ కృషి చేస్తుంది' అని ఆయన అన్నారు.

మోడీ ప్రభుత్వం తన ప్రచార కార్యక్రమ వివరాలను తెలియజేసేందుకు దేశంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలతో జరిపిన సమావేశంలో సిపిఐ(ఎం) ఇలా హెచ్చరించింది. "విద్వేషం, బీభత్సం, హింస, విషపూరిత ప్రచారం ఆధారంగా చేపడుతున్న ప్రస్తుత మత సమీకరణలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. ప్రధాని చేసిన ప్రకటన మూలాల్నే ఇవి నాశనం చేసేలా ఉన్నాయి. భయంకరంగా పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికంతో దేశం ఆర్థిక మాంద్యంలోకి అంతకంతకూ దిగబడుతోంది. మహిళలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై సామాజిక అన్యాయాలు పెరిగిపోతున్నాయి. అసమ్మతి తెలపడాన్ని జాతి వ్యతిరేకంగా పరిగణించడం వంటి చర్యలు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రజాతంత్ర హక్కులు, పౌర స్వేచ్ఛను హరిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన థీమ్ నెరవేరాలంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రస్తుత భయంకర పోకడలకు అడ్డుకట్టవేయాలి.. మన లౌకిక, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను నిర్వచించే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలికాంశాల పట్ల మనం కచ్చితంగా నిబద్ధులమై వుండాలి."

## నోట్ల రద్దుపై సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు

2016లో చేపట్టిన నోట్ల రద్దుపై అయిదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఈ చర్యను సమర్థించినట్టుగా భావించలేం.

మెజార్టీ తీర్పులో అటువంటి నిర్ణయం తీసుకునే చట్టబద్ధమైన హక్కు ప్రభుత్వానికి ఉన్నదా? 1934 ఆర్‌బిఐ యాక్ట్‌లోని సెక్షన్ 26(2) ని ప్రభుత్వం ఉల్లంఘించిందా? అన్న చట్టపరమైన అంశాలకే సుప్రీం కోర్టు పరిమితమయింది. గౌరవ న్యాయమూర్తులలో ఒకరు ఇచ్చిన అసమ్మతి తీర్పులో నోట్ల రద్దుకు ఉపక్రమించడానికి ముందు రిజర్వుబ్యాంక్ అటువంటి సిఫారసు ప్రభుత్వానికి విధిగా చేయాల్సి ఉంటుందని ఆర్‌బిఐ యాక్ట్‌నుఉటంకించారు. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి ముందు దీనికి పార్లమెంటు ఆమోదం తప్పనిసరి అని కూడా ఆ న్యాయమూర్తి పేర్కొన్నారు.

మెజార్టీ తీర్పులో 'డిమోనిటైజేషన్, అది సాధించాలనుకున్న లక్ష్యాలతో 'సహేతుకమైన అనుబంధం' కలిగి ఉంది. ఆ, లక్ష్యం సాధించబడిందా లేదా అన్నది మాకు సంబంధం లేని అంశం' అని కోర్టు పేర్కొంది.

సుప్రీం కోర్టు మెజార్టీ తీర్పు అటువంటి నిర్ణయం తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉందని చెప్పడానికి మాత్రమే పరిమితమైంది. అంతే తప్ప, ఆ నిర్ణయం తాలూకు పర్యవసానాలను అది ఏ విధంగాను ఆమోదించలేదు.

## హిమాలయ విపత్తు

ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ పట్టణం మునిగిపోవడం ప్రకృతి విపత్తు కాదు, మానవ కల్పిత, నిర్మిత పర్యావరణ విపత్తు అనే చెప్పాలి.

2021 చివరిలో భవనాల్లో పగుళ్లు స్పష్టంగా కనిపించనారంభించాయి. దాదాపు వెయ్యి ఇళ్లు, రోడ్లలో కొత్త పగుళ్లు కనిపించడమేగాక అవి చాలా వేగంగా విస్తరించాయి. ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విడుదల జేసిన చిత్రాలు ఇదే విషయాన్ని తెలియజేశాయి. 2021 డిసెంబరు 27– జనవరి 7 మధ్య పన్నెండు రోజుల్లో జోషిమఠ్‌లో దాదాపు 5.4 సెం.మీ వెడల్పుతో పగుళ్లు ఏర్పడిన విషయాన్ని ఆ చిత్రాలు స్పష్టంగా వెల్లడించాయి. 2022 ఏప్రిల్–నవంబరు మధ్య ఈ పగుళ్లు 9 సెం.మీ అంతకు మించి ఉన్నట్టు ఇస్రో గుర్తించింది. ఈ విషయం బయటకు పొక్కితే తన వినాశకరమైన పర్యావరణ వ్యతిరేక విధానాలపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు ఎక్కడ వస్తాయోనన్న భయంతో మోడీ ప్రభుత్వం ఈ చిత్రాలను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఈ విపత్తుకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు రానీయకుండా అన్ని ప్రభుత్వ సంస్థలపైన నిషేధం విధించింది.

జోషిమత్ అనేది వెయ్యి సంవత్సరాల పురాతనమైన మానవ ఆవాస కేంద్రం. ఇది పురాతన కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఒక పెళుసుగా ఉన్న ప్రదేశంలో ఇసుక, రాతి నిక్షేపాలపై ఇది స్థాపించబడింది. ఈ ప్రాంతం పెద్ద ఎత్తున మానవ నివాసానికి స్థిరమైన ప్రదేశం కాదు, కానీ హిమాలయ సమాజం ఇక్కడ పర్యావరణ అనుకూల పద్ధతిలో జీవనం సాగిస్తూ వచ్చింది. సుమారు 20,000 జనాభాతో చార్ ధామ్ తీర్థయాత్ర మార్గంలో జోషిమఠ్ ప్రాంతం ఉంది, ఇది ఔలీలోని ప్రసిద్ధ పూల లోయ, అంతర్జాతీయ స్కీయింగ్ కేంద్రానికి ప్రవేశ ద్వారంగా కూడా ఉన్నది. పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని దెబ్బ తీసింది. మతిమాలినతనంతో ఇష్టానుసారంగా నిర్మాణ కార్యకలాపాలు ప్రపంచంలోని అతి పిన్న వయసుగల పర్వత శ్రేణిలో సరైన ప్రణాళిక లేకుండా సొరంగాల తవ్వకాల వల్లే ఈ దుస్థితి దాపురించింది. మోడీ ప్రభుత్వ దృష్టి అంతా హిందూత్వ తీర్థయాత్రను ప్రోత్సహించే మత సమీకరణపైనే. ఈ ప్రాంతానికి అంతటి భారాన్ని మోయగలిగే సామర్థ్యం వుందా అనే విషయాన్ని పట్టించుకునే నాథుడే లేడు. భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చేసిన ముందస్తు హెచ్చరికలను సైతం మోడీ ప్రభుత్వం బేఖాతరు చేసింది. భారీ స్థాయిలో హోటళ్లు, రోడ్ల నిర్మాణ ప్రాజెక్టులను ప్రోత్సహించింది. రాజకీయ

నాయకులు–కాంట్రాక్టర్ల స్వార్థ ప్రయోజనాల కోసం పర్యావరణాన్ని పణంగా పెట్టింది. ఈ ప్రమాదాల గురించి ఇప్పుడే కాదు, కొన్ని దశాబ్దాల నుంచి హెచ్చరికలు వెలువడుతూనే ఉన్నాయి. అడవుల పెంపకం, సరైన డ్రైనేజీ వ్యవస్థ మొదలైనవాటితో సహా సిఫార్సు చేయబడిన పలు పరిష్కార మార్గాలను ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే క్రోనీ కేపిటలిజం విశృంఖలత్వానికి ఈ విపత్తు ఒక చక్కటి నిదర్శనం.

దీనితో వేలాది మంది ప్రజలు తమ భవనాలను ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తోంది. ప్రకటించిన పరిహారం ఏమూలలకూ చాలదు. బిజెపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగిన నష్టపరిహారం చెల్లించాలి. సురక్షిత ప్రాంతాలలో వారికి సరైన పునరావాసం కల్పించాలి.

## ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. గుజరాత్‌లో బిజెపి తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నప్పటికీ, హిమాచల్ ప్రదేశ్‌లో తన ప్రభుత్వాన్ని, గత 15 సంవత్సరాలుగా తన అధీనంలో ఉన్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌నూ కోల్పోయింది.

గుజరాత్‌లో గత మూడు దశాబ్దాలుగా బిజెపి–ఆర్ఎస్ఎస్ కొనసాగిస్తూ వస్తున్న లోతైన మతతత్వ సమీకరణల వల్లే బిజెపి వరుసగా ఏడవ సారి విజయం సాధించగలిగింది. గుజరాత్ అంతటా హిందుత్వ ప్రభావం వ్యాపింపచేయడంతోపాటు గుజరాతీ ప్రతిష్ట పేరుతో భావోద్వేగాన్ని రెచ్చగొట్టడంతో ధరల పెరుగుదల, నిరుద్యోగం. అధ్వాన స్థితిలో ఉన్న ప్రజారోగ్యం, విద్యా సౌకర్యాలు వంటి అనేక ముఖ్యమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని అది మళ్లించగలిగింది.

హిమాచల్ ప్రదేశ్‌లో అధికారాన్ని అంటిపెట్టుకోవడానికి తన వనరులను, అధికార యంత్రాంగాన్ని పెద్దఎత్తున దుర్వినియోగపరచినప్పటికీ బిజెపికి కాంగ్రెస్ చేతిలో ఘోర పరాజయం తప్పలేదు. బిజెపి దుష్పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ వాగ్దానం ఆ పార్టీకి పెద్ద ఎత్తున ఓట్లు రాల్చింది.

ఢిల్లీలో ఏకీకృత మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో గత పదిహేనేళ్లుగా కార్పొరేషన్‌ను ఏలుతున్న బిజెపిని ఆమ్ ఆద్మీ పార్టీ ఓడించింది. ఢిల్లీ

ప్రజలు బిజెపి, కేంద్ర ప్రభుత్వ దూషణలను, కుయుక్తులను అన్నింటినీ నిర్ద్వంద్వంగా తిప్పి కొట్టారు. బిజెపికి ఎంతగా ధనబలం, వనరులు ఉన్నప్పటికీ దాని బలహీనతను హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ ఫలితాలు బట్టబయలు చేశాయి. మోడీ సమ్మోహన శక్తి గురించి ప్రచారాలు దూది పింజలా కొట్టుకుపోయాయి.

హింసాత్మక ఉద్రేకాలను రెచ్చగొట్టేందుకు ఆరెస్సెస్/ బిజెపి తమ మతపరమైన 'ద్వేషపూరిత ప్రచారాన్ని అమలు చేయలేని చోట ప్రజల రోజువారీ సమస్యలే ఎన్నికల చర్చలో ప్రధానంగా ముందుకు వస్తాయని హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీలలో బిజెపి ఓటమి నిరూపిస్తున్నది. ఏది ఏమైనప్పటికీ, గుజరాత్‌లో అధిక ఓట్ల షేరుతో సాధించిన విజయం, మతపరంగా కాక పుట్టించిన ద్వేషపూరిత ప్రచారం, హిందూత్వ గుర్తింపును ఘనీభవింపచేయడంలో కృతకృత్యురాలైంది. తద్వారా ప్రజల జీవన స్థితిగతులు దిగజారడం వంటి రోజువారీ సమస్యలను వెనక్కినెట్టడంలో అది విజయవంతమైంది.

ఫాసిస్ట్ ఆరెస్సెస్, హిందూత్వ మతోన్మాదుల దుందుడుకు ఎజెండాను దీటుగా తిప్పికొట్టాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతోంది. పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పేదరికం మొదలైన సమస్యలపై పోరాటాలను బలపరుస్తూనే, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఇతర రంగాలలో తీవ్ర ప్రయత్నాలతో ఈ సవాలును ఏకకాలంలో ఎదుర్కోవలసి ఉంటుంది. హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా లౌకిక శక్తుల విశాల సమీకరణకు కృషి చేయాలి.

## త్రిపుర

త్రిపురలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిపిఐ(ఎం), ఇతర ప్రతిపక్షపార్టీలపై అధికార బిజెపి తన హింసాత్మక దాడులను మరింత తీవ్రతరం చేసింది. నవంబరు 30న, సిపిఐ(ఎం) నాయకులు, కార్యకర్తలపై జరిగిన దారుణమైన దాడి కామ్రేడ్ షాహిద్ మియా హత్యకు దారితీసింది.

సెపాహిజాలా జిల్లాలోని చరిలామ్‌లో స్థానికంగా జరిగే ఒక కార్యక్రమానికి వెళ్తున్న పార్టీ కార్యకర్తలపై బిజెపి గూండాలు హింసాత్మక దాడులకు తెగబడ్డారు.

2018 ఫిబ్రవరిలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సిపిఐ (ఎం), ఇతర ప్రతిపక్ష పార్టీలు స్వేచ్ఛగా పనిచేయడానికి, వారి కార్యాలయాలను నడుపుకోడానికి లేదా సాధారణ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించుకోడానికి వీల్లేనంతగా భయానక పరిస్థితిని సృష్టించింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న

తరుణంలో అధికార పార్టీ ప్రభుత్వ యంత్రాంగం, పోలీసుల అండదండలతో రాజకీయ ప్రత్యర్థులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తోంది.

త్రిపురలో సిపిఐ(ఎం)తో సహా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై హింసాత్మక దాడులు చోటుచేసుకున్న ప్రాంతాల్లో ఎన్నికల సంఘం పూర్తిస్థాయి బృందం పర్యటించిన తరువాత కూడా  హింస ఆగలేదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత ఈ హింస మరింతగా పెరిగిపోయింది.  సిపిఐ(ఎం)పై దారుణమైన దాడులకు సంబంధించి తొమ్మిది ఘటనలు ఈమధ్య కాలంలో చోటుచేసుకున్నాయి. టిప్రా మోతాకు చెందిన ఒక కార్యకర్త హత్యకు గురయ్యాడు. త్రిపుర ఇన్‌చార్జిగా ఉన్న ఆ పార్టీ ఆలిండియా కార్యదర్శిని చావబాదడంతో ఆయన ఆసుపత్రిపాలయ్యాడు.

హింసను కొనసాగిస్తున్న తీరు చూస్తుంటే  ఎన్నికలు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా జరగకుండా అడ్డుకునేందుకు భయానకమైన వాతావరణాన్ని సృష్టించడమే వారి లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఈ స్థితిలో ఎన్నికలు న్యాయంగా,  నిష్పక్షపాతంగా జరగాలంటే ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని, తగుచర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ హామీలు, హక్కుల ఉల్లంఘనను ఆపాలని కోరుతూ  ప్రతిపక్ష పార్టీలు ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీకి ప్రజల నుండి బ్రహ్మాండమైన స్పందన లభించింది.  స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలంటే త్రిపురలో ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కులు పూర్తిగా పునరుద్ధరించబడాలి.

## కేంద్ర కమిటీ పిలుపు

1. త్రిపురలో ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించేందుకు ప్రజలు, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సంఘీభావం పెరగాలి. స్వేచ్ఛగా, న్యాయంగా  ఎన్నికలు జరిగేందుకు ఇదొక ముందస్తు షరతు అని గుర్తుంచుకోవాలి.

   సిపిఐ(ఎం) దేశవ్యాప్తంగా సంఘీభావం తెలిపే కార్యక్రమాలను నిర్వహించనుంది.

2. పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం, అసమానతలతోపాటు ప్రజల జీవనోపాధిపై కొనసాగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 22 నుండి 28వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.

2023-24 కేంద్ర బడ్జెట్‌లో లేవనెత్తబడే అంశాలతోపాటు ఈ నిరసన ప్రచార కార్యక్రమంలో దిగువ డిమాండ్లను ప్రధానంగా లేవనెత్తాలి.

- ఉద్యోగాలు కల్పించే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి.
- అయిదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలతోపాటు అయిదు కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాల పంపిణీని పునరుద్ధరించాలి.
- జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలి రేట్ల పెంపుతోపాటు, ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులను ఇతోధికంగా పెంచాలి.
- సంపద, వారసత్వపు పన్ను విధించాలి.
- ధనికులకు పన్ను రాయితీలను ఉపసంహరించుకోవాలి. అత్యంత సంపన్నులపై పన్ను విధించాలి.
- ఔషధాలతో సహా ఆహారం, నిత్యావసర వస్తువులపై జిఎస్‌టిని ఉ పసంహరించుకోవాలి.

3. 2023, ఏప్రిల్ 5న పార్లమెంటుకు జరపతలపెట్టిన మజ్దూర్-కిసాన్ ర్యాలీ పిలుపుకు సిపిఐ(ఎం) తన పూర్తి మద్దతునిస్తుంది.

**మార్చి నెలలో సిపిఐ(ఎం) దేశవ్యాప్తంగా ఈ క్రింది సమస్యలపై రాజకీయ ప్రచార, నిరసన కార్యకలాపాలను నిర్వహించాలని నిర్ణయించింది.**

1. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపట్ల మరీ ముఖ్యంగా బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలపట్ల బిజెపి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, ఫెడరలిజంపై అది సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా, సమాఖ్య వ్యవస్థను నాశనం చేసేందుకు కేంద్రీకృతపాలనను రుద్దడానికి జరుగుతున్న యత్నాలకు వ్యతిరేకంగా ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించాలి.
2. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న యత్నాలను ఈ ప్రచారంలో ఖండించాలి. ఉన్నత న్యాయ వ్యవ్థను ప్రభుత్వానికి లొంగి ఉండేలా చేసేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న యత్నాలకు

వ్యతిరేకంగా, న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన పాత్రను పరిరక్షించేందుకు ప్రజాతంత్ర శక్తులన్నింటినీ సమీకరించాలి.

3. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరగాలంటే ప్రజాస్వామికంగా నిర్వహించడంతోబాటు, అందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. సిపిఐ(ఎం) 23వ మహాసభ తన రాజకీయ తీర్మానంలో డిమాండ్ చేసిన విధంగా ఎన్నికల సంస్కరణలను తక్షణమే ప్రవేశపెట్టాలి.

4. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రచారం చేపట్టాలి. ఇజ్రాయెల్‌లోని మితవాద ప్రభుత్వం పాలస్తీనీయులపై సాగిస్తున్న అణచివేతను తీవ్రంగా వ్యతిరేకించాలి.

***